
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

జయశంకర్ భూపాలపల్లి ములుగు

ఆదివారం 1 డిసెంబరు 2024



సీఎంను కలిసిన మంత్రి సీతక్క

- మల్లంపల్లి మండల ఏర్పాటుపై కృతజ్ఞతలు
- ఐటీడీఏల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంపై హర్షం

6

సండే స్పెషల్ SUNDAY SPECIAL



పెద్దబాడిసె.. మూగబోయే!

- యంత్రాల రాకతో బతుకులు తారు మారు
- పనిలేక ఇతర రంగాల వైపు చూపు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

దయనీయ స్థితిలో వడ్రంగులు

వడ్రంగులు.. ఒకప్పుడు రైతులకు చేదోడువాదోడుగా ఉండే ఓ నేస్తం. తొలకరి ప్రారంభమైందంటే చాలు అన్నదాతలు కాడి, నాగలి, గుంటుక, దంతె లాంటి వ్యవసాయ పనిముట్లు తయారు చేయించుకునేందుకు వడ్రంగుల చుట్టూ తిరిగేవారు. ఒక్కోసారి రోజుల తరబడి వారిచ్చే పనిముట్ల కోసం వేచిచూసేవారు. నాడు అంత బిజీగా కులవృత్తిని నిర్వహించిన వడ్రంగులు.. యాంత్రీకరణ పుణ్యమా అని దుర్భర జీవితం గడుపుతున్నారు. ఉపాధి కోసం నేటి తరం వారిలో కొందరు పట్టణాలకు పయనమైతే.. ఇంకొందరు తమ వృత్తిపరమైన యాంత్రీకరణను అందిపుచ్చుకుంటున్నారు. మిగిలిన వారు అదే కులవృత్తిని కొనసాగిస్తూ గ్రామాల్లో గడుపుతున్నారు. అయితే పరిస్థితుల ప్రభావంపై తమపై తీవ్రంగా పడిందని.. ఎన్నో కుటుంబాలు సరైన ఉపాధికి నోచుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వాలు కుల వృత్తులకు చేయూతనందిస్తామని చెప్పి మొండి చేయి చూపాయని.. ప్రస్తుత ప్రభుత్వమైనా తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

- దేవరుప్పుల, ఆంధ్రజ్యోతి



7



ములుగులోని గిరిజన బాలుర వసతిగృహం ఇరుకుగదిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బెడ్లు

గురుకులం.. కలకలం..!

- అసౌకర్యాల మధ్య విద్యార్థుల అవస్థలు
- 'సంక్షేమం'పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు
- ప్రశ్నార్థకంగా ఆరోగ్యం, భద్రత
- కడుపు నొప్పి, జ్వరం, మానసిక సమస్యలకు అందని వైద్యం
- హాస్టల్‌లో ఉండలేక, ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం
- నాసిరకంగా భోజనం.. తుప్పు పట్టిన బెడ్లు, కిటికీలు
- అద్దెభవనాల్లో 500మంది ఉండాల్సిన చోట వెయ్యి మందికిపైగా విద్యార్థులు
- పారిశుధ్య కార్మికుల కొరతతో అపరిశుభ్రంగా స్నానాలగదులు, మరుగుదొడ్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రస్తుతం గురుకులాల్లో నెలకొన్న పరిస్థితులు తీవ్ర కలకలం రేపుతున్నాయి. విద్యార్థుల సంక్షేమం గురించి అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని, విద్యార్థులకు ఆరోగ్యం, భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జ్వరం బారిన పడినా.. కడుపు నొప్పి వచ్చినా.. మానసిక సమస్యలు ఉత్పన్నమయినా పట్టించుకునేవారు ఉండక.. ఓదార్చి ధైర్యం చెప్పే వారు లేక విద్యార్థులకు హాస్టల్ అంటే హడలి పోతున్నారు. మానసిక ఒత్తిడి, తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నామనే ఆందోళనతో ఆత్మహత్యలకు కూడా వెనకాడకపోవడం అందరిలోనూ కలకలం రేపుతోంది. వీటికి తోడు నాణ్యత లేని భోజనం.. శుభ్రం చేయని మరుగుదొడ్లు.. తుప్పు పట్టిన బెడ్లను చూస్తే విద్యార్థులకు చదవాలనే ఆసక్తి సన్నగిల్లుతోంది. పారిశుధ్య కార్మికులు లేకపోవటంతో హాస్టల్ గదుల దుర్వాసన నుంచి వారికి విముక్తి దొరకడం లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు గురుకులం చదువంటే ఇష్టం.. వసతులు చూస్తే కష్టంగా మారిందనే చర్చ జరుగుతోంది.

భద్రతపైనే భయం..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 250కి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు ఉన్నాయి. వీటిలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైంది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుకు దగ్గరికి కావాలనే విద్యార్థుల ఆశపై అసౌకర్యాలు నీళ్లు చల్లుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాలా వరకు అద్దె భవనాల్లోనే గురుకులాలను ఏర్పాటు చేశారు. చాలా చోట్ల బీఆర్ఎస్ నేతల ఇళ్లను, భవనాలను గురుకులాలను అద్దెకు ఇచ్చి..



జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ సంక్షేమ హాస్టల్‌లో తుప్పుపట్టిన బెడ్లు

కనీస సౌకర్యాలు లేకపోయినా రూ.50వేల నుంచి రూ.1లక్షకు పైగా నెలనెల అద్దెలు చెల్లించారని సమాచారం. ఇప్పటికి 8 నెలలుగా అద్దెలు చెల్లించకపోవటంతో భవన యాజమానులు కనీస వసతులు కల్పించటం లేదు. పాడైన మరుగుదొడ్లను, బాత్‌రూమ్‌లు, కిటికీలకు మరమ్మతులు చేయించడం లేదు. తమకు అద్దె రావటం లేదని, పెట్టుబడి ఎక్కడి నుంచి పెట్టాలంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు. దీంతో అసౌకర్యాల మధ్య విద్యార్థులు గురుకుల విద్యను అభ్యసిస్తున్నారు. ఇక ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో ఇంతకంటే దారుణంగా పరిస్థితులు ఉండటం గమనార్హం. కిటికీలు, తలుపులు కూడా లేకపోవడంతో రాత్రి వేళల్లో పాములు, తేళ్లు, విషకీటకాలు గదుల్లోకి, ప్రాంగణాల్లోకి వస్తుండటంతో పిల్లలు భయాందోళనకు గురవుతున్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మండల కేంద్రంలో 1995లో నిర్మించిన సోషల్ వెల్ఫేర్ గురుకులంలో సుమారు 700మంది విద్యార్థులు ఉంటున్నారు. తుప్పు పట్టిన బెడ్స్, విరిగిపోయిన కిటికీలకు తోడు ధ్వంసమైన మరుగుదొడ్లతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బాత్‌రూమ్‌లు కూడా సరిగా లేకపోవటంతో పిల్లలు స్నానాలకు నరకం చూస్తున్నారు. 10వ తరగతి వరకు 500మంది పిల్లలుఉండేలా గురుకులాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇంటర్, డిగ్రీ చదివే పిల్లలకు కూడా గురుకులంలో అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే వీరికి ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం కల్పించటం లేదు. 10వ తరగతి వరకు విద్యార్థులకు కేటాయించిన భవనాల్లోనే సర్దుబాటు చేస్తున్నారు. దీంతో 500మంది ఉండాల్సిన భవనాల్లో 800 నుంచి వెయ్యి మందికి వరకు సర్దుబాటు చేయడంతో తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరుగుదొడ్లు, తాగునీరు, స్నానాలకు నీరు సరిపడక అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులను అన్ని గురుకులాల్లో నియమించలేదు. కొన్ని చోట్ల గ్రామ పంచాయతీ కార్మికులనే వినియోగిస్తున్నారు. దీంతో హాస్టళ్ల అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారుతున్నాయి. చలికాలం మొదలైనా విద్యార్థులందరికీ బెడ్‌షీట్స్ అందలేదు. దీంతో తలుపులేని కిటికీల నుంచి వచ్చే చలిగాలికి తుప్పు పట్టిన బెడ్స్‌పై భయం భయంగా నిద్రపోవాల్సి వస్తోంది. అలాగే చాలాహాస్టళ్లలో నైట్ వాచ్‌మెన్‌లు లేకపోవడంతో రాత్రివేళల్లో బయటి వ్యక్తులు హాస్టళ్లలోకి వస్తున్న సంఘటనలున్నాయి. ఇది విద్యార్థులకు రక్షణ లేదనడానికి నిదర్శనమన్న విమర్శలున్నాయి.



మహబూబాబాద్ జిల్లా మరిపెడ ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో నేలపై పడుకున్న విద్యార్థులు



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎస్సీ బాలుర హాస్టల్ గది గోడలకు చెమ్మ

నాసిరకంగా భోజనం

హాస్టల్ విద్యార్థులకు చాలావరకు నాసిరకం భోజనం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. భోజనం అందించేందుకు ఒక్కో హాస్టల్‌లో ఒక్కో విధానాన్ని అమలు చేస్తున్నారు. బియ్యాన్ని, విజయ పాలను ప్రభుత్వమే సరఫరా చేస్తుండగా, కూరగాయలు, నాన్‌వెజ్, కోడిగుడ్లు, ఇతర నిత్యాసరుకులు అందించేందుకు వేర్వేరుగా కాంట్రాక్టు

» మిగతా 6వ పేజీలో...

అనుమానాస్పదంగా ప్రైవేటు ఆస్పత్రి నర్సు మృతి

- అస్వస్థతకు గురైందని అంటున్న హాస్పిటల్ నిర్వాహకులు
- శరీరంపై గాయాలున్నాయంటున్న కుటుంబికులు
- మృతదేహంతో ఆస్పత్రి వద్ద ఆందోళన



మృతురాలు అఫ్సర్ బీ(ఫైల్)

వివరాలు 6లో...

దేశాభివృద్ధిలో నిట్ కీలక భూమిక

- డీఆర్‌డీవోలోనూ కీలక భాగస్వామ్యం
- క్షిపణి వ్యవస్థలో ప్రపంచలోనే భారత్ అగ్రగామి
- కొత్త ఆవిష్కరణలతో శక్తివంతంగా రక్షణ వ్యవస్థలు
- సరికొత్త పరిశోధనల్లో డీఆర్‌డీవో కీలక భూమిక
- డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్
- ఘనంగా వరంగల్ నిట్ 22వ స్నాతకోత్సవం
- 1,875 పట్టభద్రులకు డిగ్రీల ప్రదానం



ప్రసంగిస్తున్న డీఆర్‌డీవో చైర్మన్


7



హనుమకొండ నిట్ స్నాతకోత్సవంలో విద్యార్థుల కేరింతలు

కేసీఆర్ పాలనలో రూ.7వేల కోట్ల అప్పు

- ఏడాదికి రూ.6వేల కోట్ల వడ్డీ కడుతున్నాం
- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

కాకతీయఖని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తన పదేళ్ల పాలనలో కేసీఆర్ రూ.7వేల కోట్ల అప్పు చేసి, రాష్ట్రాన్ని దివాలా తీశారని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు తెలంగాణ చైర్మన్ జనక్ ప్రసాద్ ఆరోపించారు. భూపాలపల్లి పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ముఖ్యమంత్రి చేసిన అప్పులకు ప్రస్తుత ప్రభుత్వం సంవత్సరానికి రూ.6వేల కోట్ల మిత్తి కట్టాల్సి వస్తోందని తెలిపారు. లక్షల కోట్లు వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని, అది కుంగిపోయిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల పాత్రను కేసీఆర్ మరచిపోయారని దుయ్యబట్టారు. 65వేల మంది ఉన్న కార్మికులను ప్రస్తుతం 40వేలకు

» మిగతా 8వ పేజీలో...

ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం : ఎమ్మెల్యే సత్యనారాయణరావు

8

గురుకులం.. కలకలం..!

(5వ పేజీ తరువాయి)

అప్పగించటం, వాటిపై పైఅధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో నాసిరకం సరుకులు హాస్టళ్లకు చేరుతున్నాయి. కొన్ని గురుకులాలకు ఒకే కాంట్రాక్టర్ నుంచి సరుకులు వస్తున్నట్టు సమాచారం. అయితే సరుకులన్నీ ఒకేసారి రావడంతో అవి స్టోర్ రూమ్‌లో ఉండి ముక్కి పోతున్నాయని, కొన్ని చోట్ల వాటినే వండి పెడుతుండటంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని పలువురు విద్యార్థులు పేర్కొంటున్నారు.

మానసిక ఒత్తిడికి ఓదార్పేదీ ?

హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు సవాల్‌గా మారుతున్నాయి. హాస్టల్‌లో తినే ఆహారం పడకనో.. బయట నుంచి తెచ్చుకున్న తిన్న ఫుడ్ వికటించో రాత్రి వేళ కడుపు నొప్పి, జ్వరం వస్తే పట్టించుకునే వారు ఉండటం లేదు. కనీసం డాక్టర్ల వద్దకు తీసుకెళ్లేందుకు గురుకులాల్లో సిబ్బంది అందుబాటులో ఉండకపోవటంతో రాత్రంతా నొప్పితో బాధపడాల్సిందేనని విద్యార్థుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. తెల్లారిన తరువాత తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారనే ఆరోపణలున్నాయి. క్లిష్ట పరిస్థితుల్లో వైద్యం అందక కొన్ని చోట్ల విద్యార్థులు మృతి చెందుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇక మానసిక సమస్యలు ఎదుర్కొనే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు గురుకులాల్లో సైకాలజిస్టులను ప్రభుత్వం నియమించ లేదు. దీంతో చాలాచోట్ల గురుకుల భవనాల పైకి ఎక్కి ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలున్నాయి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఎక్కడ ?

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థ లేదు. ఈ గురుకులాలకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నా.. పరిపాలనపైనే వారు ప్రధానంగా దృష్టిపెడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆదేశాలతో హాస్టళ్లపై కలెక్టర్లు దృష్టి పెడుతున్నారు. అయితే ప్రత్యేకంగా హాస్టళ్ల పర్యవేక్షణ వార్డెన్లు, హెచ్‌ఎంలపైనే ఉంటుంది. బీసీ గురుకులాలను పర్యవేక్షించేందుకు ఒక నోడల్ అధికారిని మాత్రమే ప్రభుత్వం నియమించింది. ఒక్కరు ఎన్ని గురుకులాలను పర్యవేక్షించగలరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సంక్షేమశాఖ అధికారులకు గురుకులాలపై అధికారం లేకపోవటంతో పర్యవేక్షణ కరువవుతోంది. దీంతో హాస్టల్ వార్డెన్లు, ప్రిన్సిపాల్స్ పైనే భారం పడుతోంది. చాలా చోట్ల వారు కూడా చేతులెత్తేస్తుండటంతో గురుకులాలు సమస్యల వలయాలుగా మారుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..

- బీసీ గురుకులాలు - 36
- ఎస్సీ గురుకులాలు - 33
- మైనారిటీ గురుకులాలు - 16
- ఎస్టీ గురుకులాలు - 42

ఆందోళన కలిగిస్తున్న సంఘటనల్లో కొన్ని..

- జూన్ 23న జనగామ జిల్లా చిల్పూరులో కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని వర్షిణి (14) తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక, హాస్టల్‌లోనే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కలకలం రేపింది.
- జూలై 11వ తేదీన కేసముద్రంలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌కు చెందిన తొమ్మిదోతరగతికి చెందిన పవిత్ర అనే బాలిక ప్రమాదవశాత్తు హాస్టల్ భవనంపై నుంచి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి.
- ఆగస్టు 9వ తేదీన ములుగులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కార్తీక తల్లిదండ్రులకు దూరంగా ఉండలేక హాస్టల్ భవనపై నుంచి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది.
- ఆగస్టు 14న ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లిలోని ఆశ్రమ పాఠశాలలో ముకేష్ అనే విద్యార్థి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వార్డెన్, హెచ్‌ఎంల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి.
- అక్టోబరు 27న భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని ప్రభుత్వం గర్ల్స్ మోడల్ స్కూల్ హాస్టల్‌లోకి అర్ధరాత్రి ఓ యువకుడు చొరబడ్డారు. అమ్మాయిల అరుపులతో ఆ యువకుడు తిరిగి వెళ్లిన ఘటన భద్రత లోపాన్ని ఎత్తిచూపుతోంది.
- నవంబరు 14వ తేదీన ములుగు జిల్లా బండారుపల్లి గురుకులంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న రాజేష్ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. మానసిక ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలుస్తోంది.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం డీఈవో అధ్యక్షతన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్ రావు జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు జిల్లాలోని నలుమూలల పాఠశాలల నుంచి 245 మంది విద్యార్థులు ఎగ్జిబిట్లు ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, అధికారులు మందుల శ్రీరాములు, సంకా బద్రినారాయణ, లచ్చిరాంనాయక్, ఉపేందర్‌రావు, గురునాథరావు పాల్గొన్నారు.

లగచర్ల రైతుల విజయం.. కాంగ్రెస్ ఓటమికి సంకేతం

కురవి (ఆంధ్రజ్యోతి) : లగచర్ల రైతుల పక్షాన బీఆర్ఎస్ చేసిన పోరాటం వృథాగా పోలేదని, మానుకోట ధర్నా సాక్షిగా భూసేకరణలో ప్రభుత్వం వెనక్కి తగ్గడం గిరిజన రైతుల విజయానికి, కాంగ్రెస్ ప్రభుత్వ ఓటమికి సంకేతమని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. కురవిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. లగచర్ల ఘటనలో కలెక్టర్, ఇతర సిబ్బందిపై దాడి రైతుల ఆగ్రహానికి, మనోభావాలకు నిదర్శనమన్నారు. ఎవరో సురేష్ చెప్పాడని మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేసి, కేటీఆర్‌ను కేసులో ఇరికించాలనుకోవడం సిగ్గుచేటన్నారు. మీ ఇంటలిజెన్స్ ఏమైంది..? మంత్రులు పాలన చేతకాక గాడిదలు కాస్తున్నారా అని విమర్శించారు. దిలావర్‌పూర్‌లో ఇథనాల్‌పరిశ్రమ వద్దని ప్రజలు ఆందోళన చేస్తుంటే తలసాని అల్లుడు, వియ్యంకుడు ఉన్నాడని కాంగ్రెస్ చెబుతుందని, బీఆర్ఎస్ నాయకుల పరిశ్రమకు మీరెందుకు మద్దతు పలుకుతున్నారని ప్రశ్నించారు. సవేశంలో బీఆర్ఎస్ నాయకులు ఐలు నరహరి, బోడ శ్రీను, బాదె నాగయ్య, కిశోర్ రాజు, గుగులోతు నెహ్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, రవీందర్‌రావు

అనుమానాస్పద స్థితిలో ప్రైవేటు ఆస్పత్రి నర్సు మృతి



అఫ్సర్‌బీ మృతదేహంతో ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

- అస్వస్థతకు గురైందని అంటున్న హాస్పిటల్ నిర్వాహకులు
- శరీరంపై గాయాలున్నాయంటున్న కుటుంబీకులు
- మృతదేహంతో ఆస్పత్రి వద్ద ఆందోళన

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆస్పత్రి నిర్వాహకులే ఆమెను పొట్టన పెట్టుకున్నారంటూ మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...

భూపాలపల్లి పట్టణంలోని టీ-2 క్వార్టర్స్ కాలనీకి చెందిన ఎస్‌కె. అఫ్సర్‌బీ (28) కొన్నేళ్ల క్రితం భర్తతో విడిపోయి తల్లిదండ్రులు మదార్, సుల్తానా వద్ద ఉంటోంది. ఆమెకు అఫ్జల్ అనే పన్నెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భూపాలపల్లిలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సుగా అఫ్సర్‌బీ పనిచేస్తోంది. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో నైట్‌షిఫ్ట్‌కు వెళ్లింది. శనివారం తెల్లవారుజామున ఉదయం 4 గంటలకు ఆస్పత్రి ఉద్యోగి ఒకరు హుటాహుటిన అఫ్సర్‌బీ ఇంటికి వచ్చారు. మీ కుమార్తె అస్వస్థతకు గురైందని చెప్పి తోడుగా ఆమె తండ్రి మదార్‌ను తీసుకెళ్లారు. ఆస్పత్రికి చేరుకున్న మదార్ తన కూతురిని పరిశీలించగా అప్పటికే ఆమె శరీరం చల్లబడి ఉంది. అనంతరం ఆస్పత్రి నిర్వాహకులు హనుమకొండలోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్ ఎక్కించారు. మార్గమధ్యంలోనే అఫ్సర్‌బీ మృతి చెందింది. దీంతో ఆస్పత్రి నిర్వాహకులు మృతదేహాన్ని ఆమె ఇంటి వద్ద దింపేసి వెళ్లిపోయారు. అఫ్సర్ ఎలా మృతి చెందిందనే విషయం యాజమాన్యం స్పష్టతన్వికపోవడం, పొంతనలేకుండా మాట్లాడటంపై కుటుంబ సభ్యుల్లో అనుమానం వ్యక్తమవుతోంది. ఆమె శరీరంపై గాయాలై ఉన్నాయని, ఆస్పత్రిలో ఏదో జరిగి ఉంటుందని వారు ఆరోపిస్తున్నారు. అఫ్సర్‌బీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్నా అక్కడ చికిత్స అందించకుండా హనుమకొండలోని మరో ఆస్పత్రికి తరలించేందుకు చేసిన యత్నంపై కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మృతదేహంతో ఆందోళన

స్టాఫ్‌నర్స్ అఫ్సర్‌బీ మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆమె పని చేస్తున్న ఆస్పత్రి వద్ద శనివారం ఆందోళనకు దిగారు. ఎంతో ఆరోగ్యంతో ఉండే ఆమెను ఆస్పత్రి నిర్వాహకులే పొట్టనబెట్టుకున్నారంటూ విలపించారు. తమకు న్యాయం చేసేదాకా కదలేది లేదంటూ భీష్మించుకుని బైఠాయించారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎస్సై సుధాకర్ అక్కడికి చేరుకుని మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పోస్టుమార్టం చేయిస్తే నిజనిజాలు బయటకు వస్తాయని సర్ది చెప్పారు. ఆస్పత్రి డాక్టర్‌తో మాట్లాడించి ఆందోళనను విరమింపజేసి మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అఫ్సర్‌బీ మృతిపై విచారణ చేపట్టి, కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ, ధర్మ సమాజ్ పార్టీ నేతలు ఆస్పత్రి ఎదుట శనివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ చేపడుతున్నామని భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ తెలిపారు.

అఫ్సర్‌బీ మా చెల్లెలు లాంటిది : డాక్టర్ పృథ్వీ

అఫ్సర్‌బీ మా చెల్లెలు లాంటిది. ఆమె మాలో ఒకరు. రోజువారీ విధుల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడింది. ప్రాథమిక చికిత్స అందించి ఇంటికి వెళ్లమని చెబితే పర్వాలేదంది. ఉన్నట్టుండి అపస్మారక స్థితికి వెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలిస్తుండగా మృతి చెందింది.

సీఎంను కలిసిన మంత్రి సీతక్క

మల్లంపల్లి మండల ఏర్పాటుపై కృతజ్ఞతలు



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు అశోక్

ములుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శనివారం కలిశారు. ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌తో కలిసి హైదరా బాద్‌లోని సీఎం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. ములుగు జిల్లాలో కొత్తగా మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రామప్పను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.73.47 కోట్లను మంజూరు చేయిం చారని కొనియాడారు. పేదల అభ్యున్నతికి సీఎం కృషి చేస్తున్నారని, ఐటీడీఏల ద్వారా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం హర్షణీయమన్నారు.

ఆటో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్

కాటారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆటో ఓనర్స్, డ్రైవర్స్‌ను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో శనివారం జేఏసీ ఆధ్వర్యంలో పేట బక్కయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం అమల్లోకి తేవడంతో ఆటోలకు గిరాకీ పడిపోయిం దన్నారు. ఈ క్రమంలో ఏడాది కాలంలో 65 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆటో డ్రైవర్లకు రూ. 12 వేల భృతి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ల నాయకులు బక్కయ్య, శంకర్, తిరుపతి, శ్రీను, స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేట బక్కయ్య, ఉపాధ్యక్షుడిగా మారపాక వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల శంకర్, కోశాధికారిగా అంగడి వెంకటేశ్, అధికార ప్రతినిధిగా మంథెన మహేష్, కార్యదర్శులుగా గద్దల తిరుపతి, సంగెం మల్లయ్య, సహాయ కార్యదర్శిగా చీర్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు



చెరుకూరులో వెలిసిన కరపత్రాలు

వాజేడు/మంగపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు వ్యతిరేకంగా వాజేడు, మంగపేట మండలాల్లో ఆదివాసీ ఐక్య వేదిక పేరుతో కరపత్రాలు, పోస్టర్లు వెలిశాయి. 'ఆదివాసీలంటే లెక్కలేదా?' అంటూ వాటిలో పేర్కొన్నారు. వాజేడులో ఇద్దరిని మావోయిస్టులు హతమార్చిన నేపథ్యంలో పోస్టర్లు, కరపత్రాలు వెలిసినట్టు తెలుస్తోంది. ఆదివాసీల కోసమే పోరాడుతున్నామని నీతులు చెప్పే మావోయిస్టులు అడవిని తమ చేతులలో పెట్టుకొని ఇన్‌ఫార్మర్ల పేరుతో వారినే చంపుతున్నారని పేర్కొన్నారు. ఉయిక రమేష్, ఉయిక అర్జున్‌నునరికి చంపి పొట్టనపెట్టుకోవడం దారుణమని విమర్శించారు. కష్టపడి చదివి పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సంపాదించిన రమేష్, కూలి పనులు చేసుకుంటున్న అర్జున్‌ను ఇన్‌ఫార్మర్లుగా బద్నాం చేసి చంపడం అన్యాయమని పేర్కొన్నారు.

అమాయక ఆదివాసీలను మావోయిస్టులు భయపెట్టి తమకు కావాల్సిన వస్తువులను తెప్పించుకుంటున్నారని దుయ్యబట్టారు. ఆదివాసీలు నివసిస్తున్న ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పరచుకొని ఆవారినే ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన ఈ పోస్టర్లు, కరత్రాలు రెండు మండలాల్లో కలకలం రేపాయి. అవి ఎవరు వదిలి వెళ్లి ఉంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు : మహబూబాబాద్ కలెక్టర్

మహబూబాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ, పురుషుల నిష్పత్తి సమానంగా ఉండేటట్లు ప్రజల్లో అవగాహన కల్పించాలని, స్కానింగ్ సెంటర్లలో తనిఖీల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేసినట్లు గుర్తిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం డిస్ట్రిక్ట్ లెవల్ మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో క్వాలిఫైడ్ వైద్యులు మాత్రమే పని చేయాలని, జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తి తక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ కళాజాత బృం దాలచే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. చట్టప్రకారం అన్ని జన్యు సంబంధ పద్ధతులు పరీక్షలు నిర్వహించే వ్యక్తులు, సంస్థలు, వైద్యులు సంబంధిత జిల్లా వైద్యప్రత్యేక నిర్దేశిత అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వద్ద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు.

చట్ట పరిధిలో అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలు లేదా పరికరాలు తప్పనిసరిగా నమోదు చేయించాలని, చేయించుకున్న తర్వాత తిరిగి ఐదేళ్లకు ఒకసారి తిరిగి రెన్యూవల్ చేయించుకోవాలని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో మురళీధర్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, స్త్రీ, పురుషుల మధ్య వివక్ష ఉండకూడదన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, అధికారులు తిరుపతిరావు, ప్రమీల, డాక్టర్ సారంగం, శ్రవణ్‌కుమార్, కేవీ రాజు, రామకృష్ణ, అరుణ్, మనోహర్ పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం



- జనగామ పోరుగడ్డ బిడ్డకు దక్కిన గౌరవం
- కడు పేదరికం నుంచి అత్యున్నత స్థాయికి
- జిల్లాలో వెల్లివిరిసిన ఆనందం

జనగామ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం నియమితులు కావడంపై జిల్లావాసుల్లో ఆనందం నెలకొంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా ఎం.మహేందర్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా డిసెంబరు 3తో ఆయన పదవీ కాలం పూర్తి కానుండడంతో ప్రభుత్వం కొత్త చైర్మెన్ నియామకం కోసం నోటిఫికేషన్ ఇవ్వగా ఈ నెల 20 వరకు 45 అప్లికేషన్లు వచ్చాయి. రిటైర్డ్ ఐఏఎస్‌లు, వివిధ వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు ఈ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోగా జనగామ జిల్లాకు చెందిన బుర్రా వెంకటేశం పేరును సీఎం రేవంత్‌రెడ్డి ఎంపిక చేసి గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపారు. కాగా తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సెక్రటరీగా ఉన్న వెంకటేశం దరఖాస్తుకు గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఈ నెల 4 నుంచి వెంకటేశం టీజీపీఎస్సీ చెర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

నిరుపేద కుటుంబం నుంచి..

నిరుపేద వ్యవసాయ కుటుంబం నుంచి బుర్రా వెంకటేశం తన జీవన ప్రస్థానాన్ని ప్రారంభించారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తన తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. తల్లి కూలీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తుండగా తన విద్యాభ్యాసంలో ఇవేవీ అడ్డంకులుగా చూడకుండా తన లక్ష్యసాధన కోసం ఆయన ఎంతగానో శ్రమించి చివరకు తన కోరికను నెరవేర్చుకున్నారు.

సాంస్కృతిక కార్యదర్శిగా ఉన్న సమయంలో తన స్వగ్రామ మైన జనగామ మండలం ఓబుల్ కేశ్వాపురంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని గ్రామస్తుల సహకారంతో నిర్మించి ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.

బుర్రా వెంకటేశం నేపథ్యమిది ..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్‌గా నియమితులైన బుర్రా వెంకటేశం స్వగ్రామం జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్. ఆయన డిగ్రీ హైదరాబాద్ చిక్కడపల్లి లోని అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో కొనసాగింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన వెంకటేశం చదువులో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతూ అత్యున్నత స్థాయికి చేరుకున్నారు.

1995 గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1వ ర్యాంకు సాధించి టాపర్‌గా నిలిచారు. 1996లో ఆదిలాబాద్ ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేయగా 1996 చివర్లో తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా, 1998లో రాజమండ్రి సబ్ కలెక్టర్‌గా, 1999లో వరంగల్ మునిసిపల్ కమిషనర్‌గా, 2001లో చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా, 2003లో గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం గవర్నర్ సెక్రటరీగా, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు కొనసాగిస్తున్నారు.



డిగ్రీ పట్టా ప్రదానం చేస్తున్న సమీర్, చిత్రంలో బిద్యాధర్ సుబుధి

దేశాభివృద్ధిలో నిట్ కీలక భూమిక

- క్షిపణి వ్యవస్థలో ప్రపంచంలోనే భారత్ అగ్రగామి
- డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్
- ఘనంగా వరంగల్ నిట్ 22వ స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో నిట్ డైరెక్టర్, డీఆర్‌డీవో చైర్మన్, వివిధ శాఖల అధిపతులు

హనుమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల (నిట్) కీలక భూమిక పోషిస్తున్నదని డిఫెన్స్ డైరెక్టోరేట్ (ఆర్అండ్‌డీ) సెక్రెటరీ, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ ఏ కామత్ ప్రశంసించారు. తమ డీఆర్‌డీవోలోనూ భాగస్వామి అవుతూ నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తున్నదని అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో 22వ స్నాతకోత్సవం కన్నుల పండువగా జరిగింది. 1,875 మంది అభ్యర్థులు పట్టాలు స్వీకరించారు. అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌హాల్‌లో జరిగిన ఈ స్నాతకోత్సవానికి నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ కామత్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ప్రస్తుతం డిగ్రీలు అందుకుంటున్న పట్టభద్రుల్లో చాలామంది కొవిడ్ మహమ్మారి వ్యాపించిన అత్యంత సంక్షుభిత సంవత్సరం 2020లో తమ చదువును ప్రారంభించినప్పటికీ ధైర్యంగా విద్యను పూర్తిచేయడం అభినందనీయమన్నారు. పట్టాలు స్వీకరిస్తున్న ఈ తరుణం.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఒక మధురమైన జ్ఞాపకమని, జీవితంలో కొత్త అడుగువేసే రోజు అన్నారు. అత్యున్నత ప్రమాణాలతో కూడిన వరంగల్ నిట్ నుంచి పట్టభద్రులైనందుకు విద్యార్థులు గర్వపడాలన్నారు. కెరీర్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించడం ద్వారా ఈ విద్యాసంస్థ పేరును నిలబెట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో మొట్టమొదటి ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాల స్థాయి నుంచి జాతీయ సాంకేతిక కళాశాలగా ఎదిగిన వరంగల్ నిట్ ప్రస్థానం అద్వితీయమని డాక్టర్ కామత్ కొనియాడారు. అత్యున్నత విద్యా ప్రమాణాలను అందించడం, సరికొత్త ఆవిష్కరణలకు జీవం పోయడం, నూతన సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా తనను తాను మలుచుకోవడం ద్వారా నిట్ తన ప్రస్థానాన్ని విప్లవాత్మకంగా సాగించిందన్నారు. దేశాభివృద్ధిలో, సాంకేతిక ప్రగతిలో, డీఆర్‌డీవోకు సహకారం అందించడంలో నిట్ క్రియాశీల భూమిక పోషించిందన్నారు. నిజానికి తన మొదటి బాస్ మాలకొండయ్య వరంగల్ నిట్ పూర్వవిద్యార్థేనని ఆయన గుర్తు చేసుకున్నారు. నిట్‌లో విద్యార్థులు పొందిన జ్ఞానం, నైపుణ్యం వారిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుందన్నారు. విద్యార్థులు డిగ్రీలు పుచ్చుకోవడంతోనే పూర్తి కాలేదని, అసలైన జీవితం ముందున్నదన్నారు. అధ్యయనం అనేదానికి అంతం లేదని, మీరు ఉన్నతవిద్యార్జన చేసేప్పుడు, ఎంచుకున్న రంగంలో రాణించాలనుకున్నప్పుడు మరింత జ్ఞానం పొందాలన్న ఆకాంక్ష, ఆకలి ఎప్పుడూ ఉండాలని ఉద్బోధించారు. వైవిధ్యంగా, సృజనాత్మకంగా ఆలోచించేవారిదే భవిష్యత్తు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మారడం, కొత్త విషయాలను తెలుసుకోవడం, అందరితో కలిసి పనిచేయడం, అందరినీ కలుపుకొని పోవడం ద్వారానే ఎవరైనా విజయం సాధిస్తారని అన్నారు. విజయానికి అడ్డదారులు ఉండవని, మీరు ఎంచుకునే మార్గం, ఆ దిశగా మీరు బలంగా వేసే అడుగులే మీ గెలుపునకు చిరునామాలుగా నిలుస్తాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం, చేరుకోవాలనుకున్న గమ్యం పట్ల మీకు అంతులేని విశ్వాసం, అకాంక్ష ఉండాలన్నారు.

అలాగే డీఆర్‌డీవో సాధించిన విజయాల గురించి డాక్టర్ కామత్ వివరించారు. విస్తృతమైన మానవ వనరులు, శాస్త్ర పరిశోధనల ఏర్పాట్లు కలిగిన డీఆర్‌డీవో.. రక్షణ రంగంలో తనదైన క్రియాశీల భూమిక పోషిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో డీఆర్‌డీవో సాధించిన విజయాలను విద్యార్థులతో పంచుకున్నారు. క్షిపణుల రంగంలో చోటుచేసుకున్న సరికొత్త ఆవిష్కరణల గురించి వివరించారు. మన దేశ రక్షణ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి క్షిపణులైనా తయారుచేసే స్థితిలో మన దేశం ఉందన్నారు.

అగ్ని, పృథ్వీ వంటి క్షిపణులు, తేలికపాటి యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంక్ అర్జున్, రాకెట్ లాంచర్ పినాక, మెయిన్ డిఫెన్స్ మిస్సైల్ ఆకాశ్, వివిధ రకాల రాడార్లు, వార్‌హెడ్ వ్యవస్థలు, అండర్‌వాటర్ సిస్టమ్ రాపిడో వంటి సాయుధ సంపత్తి ఈ సంస్థద్వారానే జరిగిందన్నారు. ఇటీవల రూపకల్పన చేసిన మిషన్ శక్తి యాంటీ సబ్‌మెరింగ్ వార్‌హెడ్ కూడా ఈ కోవలోనివే అన్నారు. వీటన్నిటి వల్లనే దేశ రక్షణరంగం అత్యంత శక్తివంతమైందిగా నిలిచిందన్నారు.

క్షిపణి వ్యవస్థలో ప్రపంచంలోనే మన దేశం అగ్రస్థానంలో ఉందని, సరికొత్త ఆవిష్కరణలతో మన రక్షణ రంగం అత్యంత శక్తివంతంగా మారిందని అన్నారు. ఆధునాతన లైట్‌వెయిట్ టార్పెడో, యాంటీ-టార్పెడో డెకోయ్ సిస్టమ్స్, అటానమస్ అండర్ వాటర్ వెహికిల్స్, ఓడల కోసం అధునాతన హల్ మౌంటెడ్, టోప్డ్ ఆర్రే సోనార్లు, జలాంతర్గాల కోసం ఇందన కణాల అధారిత ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపెల్షన్ సిస్టమ్స్ వంటి వాటిని అభివృద్ధి చేయడం ద్వారా రక్షణ రంగంలో ప్రపంచ దేశాల కన్నా ముందున్నామన్నారు. జైకిసాన్, జైజవాన్, విజ్ఞాన్, జై అనుసంధాన్ నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ సర్వతోముఖాభివృద్ధికి శ్రమిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచంలో అగ్ర దేశాలకన్నా మిన్నగా ఉండగలదన్న విశ్వాసాన్ని డాక్టర్ కామత్ వ్యక్తం చేశారు. కాగా, డాక్టర్ సుబుధీ స్ఫూర్తిదాయక ప్రసంగం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నది. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి స్నాతకోత్సవ ప్రసంగం చేశారు.

కనుల పండువగా స్నాతకోత్సవం

1,875 మందికి డిగ్రీల ప్రదానం ⏩ 11 మందికి బంగారు పతకాలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పట్టభద్రుల తల్లిదండ్రులు
- స్నాతకోత్సవ వీక్షణకు డిజిటల్ స్ర్కీన్ల ఏర్పాటు

హనుమకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ 22వ స్నాతకోత్సవం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. రెండు వేల మందికిపైగా పట్టభద్రులు, నిట్‌లో ప్రస్తుతం చదువుతున్న మరో రెండు వేల మంది విద్యార్థులు, తమ పిల్లలు డిగ్రీలు తీసుకుంటుందగా ప్రత్యక్షంగా చూడాలని స్నాతకోత్సవానికి వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో నిట్ క్యాంపస్ కిటకిటలాడింది. ఈసారి స్నాతకోత్సవాన్ని ఆడిటోరియంలో కాకుండా అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేయడంతో స్థలాభావం వల్ల పట్టభద్రులకు తప్ప ఇతరులకు అనుమతివ్వలేదు. దీంతో తల్లిదండ్రులు నిరాశపడ్డారు. అయితే వారు స్నాతకోత్సవాన్ని తిలకించేందుకు వీలుగా క్యాంపస్‌లోని నాలుగు సెమినార్ హాళ్ల లో డిజిటల్ స్ర్కీన్లను ఏర్పాటు చేశారు. మీడియాకు కూడా లోనికి అనుమతించక పోవడంతో వారు కూడా డిజిటల్ స్ర్కీన్ ప్రసారం మీదే ఆధారపడాల్సి వచ్చింది.

స్నాతకోత్సవం జరిగింది ఇలా..

సరిగ్గా ఉదయం 10గంటలకు జాతీయ గీతాలాపనతో స్నాతకోత్సవం ప్రారంభమైంది. 10.05 గంటలకు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ కాన్వోకేషన్‌ను ప్రారంభించారు. అనంతరం నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధీ స్వాగతోపన్యాసం చేశారు. నివేదిక సమర్పించారు. ఆ తర్వాత ముఖ్య అతిథి డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ స్నాతకోపన్యాసం చేశారు. అనంతరం పట్టభద్రులకు డిగ్రీలు, బంగారు పతకాలను ప్రదానం చేశారు. డాక్టర్ కామత్‌ను నిట్ డైరెక్టర్ శాలువతో సత్కరించారు. జాతీయ గీతాలాపనతో కాన్వోకేషన్ ముగిసింది.

1,875 మందికి డిగ్రీల ప్రదానం

స్నాతకోత్సవంలో 1875 మంది పట్టభద్రుల్లో 147 మంది పీహెచ్‌డీ, 539 మంది ఎంటెక్, 154 మంది ఎంఎస్‌సీ, 22 మంది ఎంబీఏ, 55 మంది ఎంఎస్‌సీ, 22 మంది 949 మంది బీటెక్ పట్టభద్రులు ఉన్నా రు. జాతీయ విద్యా విధానానికి (ఎన్ఈపీ) అనుగుణంగా నిష్క్రమణ విధానంలో మరో 9 మంది డిగ్రీలు స్వీకరించారు. మంజిమా కర్మాకర్ ఇన్‌స్టిట్యూట్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. మనీషా వర్షిణి ఎంసీఏ, అన్ని పీజీ ప్రోగ్రాంలలో టాపర్‌గా నిలిచి బంగారు పతకాన్ని అందుకున్నారు. అరుణ్‌కుమార్ కెమిస్ట్రీలో ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్‌కు రోల్ ఆఫ్ ఆనర్‌ను తీసుకున్నారు. మొత్తం 11మందికి విద్యార్థులు బంగారు పతకాలను అందుకున్నారు. ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్, పీజీ అవార్డు లు ఇద్దరు స్వీకరించారు.

ప్రగతి పథంలో వరంగల్ నిట్

- నిట్‌కు 54.72 కోట్ల ప్రాజెక్టులు
- 4.19 కోట్ల కన్సల్టింగ్ గ్రాంట్లు
- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ ప్రగతి పథంలో పయనిస్తోందని, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఖ్యాతిని ఆర్జిస్తోందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి పేర్కొన్నారు. శనివారం నిట్‌లో 22వ స్నాతకోత్సవం సందర్భంగా నిట్ ప్రగతిపై నివేదిక సమర్పించారు. నిట్‌లో పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఇన్‌స్టిట్యూట్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ ఏడాది నలుగురు అధ్యాపకులకు పరిశోధనా విశిష్ట పురస్కారాలు లభించాయని తెలిపారు. విధుల నిర్వహణలో నైపుణ్యాన్ని పెంపొందిచేందుకు ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది అవార్డులను కూడా ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఉత్తమ థీసిస్ అవార్డులను ఏర్పాటు చేశామన్నారు. నిట్‌కు రూ.54.72 కోట్ల విలువైన ప్రాజెక్టులు, రూ.4.19కోట్ల విలువైన కన్సల్టింగ్ గ్రాంట్లు మంజూరయ్యాయని ప్రొఫెసర్ సుబుధి వెల్లడించారు. ఇన్‌స్టిట్యూట్ గ్రాంట్లు అందించడం, పరిశ్రమతో సహకారాన్ని ప్రోత్సహించడం ద్వారా స్టార్టప్‌ల ను ప్రారంభించేందుకు అధ్యాపకులు, విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ల ద్వారా నిట్ విద్యార్థులను ఎంపిక చేయడానికి ప్రపంచవ్యాప్తంగా 300 కంపెనీలు నిట్‌క్యాంపస్‌ను సందర్శించాయన్నారు. గతేడాది అత్యధికంగా రూ.88లక్షల ప్యాకేజీని నిట్ విద్యార్థి అందుకున్నారన్నారు. సమర్థవంతమైన పాలన కోసం నిట్‌లో గత సంవత్సరం నవంబరు 2023 నుంచి ఈ-ఆఫీస్ విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.2.3కోట్ల ఎండోమెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు.



స్నాతకోత్సవానికి హాజరైన పట్టభద్రులు

క్రీడలతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే నాగరాజు ➡ ఆఫీసర్స్ క్లబ్ వేదికగా టెన్నిస్ టోర్నీ షురూ



క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 30: (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. శనివారం వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ టెన్నిస్ క్రీడాకారుడు శ్రీనివాస్‌గౌడ్ జ్ఞాపకార్థం హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్ ఏర్పాటుచేసిన జాతీయస్థాయి టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలను కేఆర్.నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా శ్రీనివాస్‌గౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాకతీయులు పరిపాలించిన గడ్డపై జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

వివిధ రాష్ట్రల నుంచి వచ్చే క్రీడాకారులకు ఉమ్మడి జిల్లా విశిష్టతను, కాకతీయ కాలంనాటి కళాఖండాలను వీక్షించడంతో పాటు కాకతీయుల చరిత్ర, ప్రాచీనమైన దేవాలయాలు దర్శించుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగ్ర సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా అసోసియేషన్‌కు శ్రీనివాస్ జ్ఞాపకార్థం రూ.2లక్షల, 50వేల నగదు ప్రోత్సాహంతో జాతీయస్థాయిలో ఓపెన్ టూ ఆల్ మెన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు పండగా వాతావరణంలో నాకౌట్ పద్ధతిన నిర్వహిస్తామని చెప్పారు. టెన్నిస్ టోర్నీలో వివిధ రాష్ట్రాల నుంచి 104మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

అనంతరం అసోసియేషన్ బాధ్యులతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు టెన్నిస్ ఆడి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి రవీందర్‌రెడ్డి, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బాధ్యులు ఎల్లా మురుగస్, రాజేశ్వర్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, కన్నారెడ్డి, గోపాల్‌రావు, పురుషోత్తంరెడ్డి ఈసీ మెంబర్లు సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద బాడిసె.. మూగబోయె !

- దయనీయ స్థితిలో వడ్రంగులు
- యంత్రాల రాకతో బతుకులు తారు మారు
- పనిలేక ఇతర రంగాల వైపు చూపు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

సండే స్పెషల్ SUNDAY SPECIAL

దేవరుప్పుల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వడ్రంగికి.. రైతులకు విడదీయలేని బంధం ఉండేది. పంటలు సాగు చేయాలంటే వడ్రంగులు చేసే వ్యవసాయ పనిముట్లు ఎంతో అవసరం. తొలకరి చినుకులు పడే వరకు వడ్రంగులు చాలా పనుల్లో నిమగ్నమై ఉండేవారు. తెల్లవారు జామునే బాడిసె, ఉలి, గూటం, సుత్తి, పిడసాని, రంపం తదితర పనిముట్లు చేతబట్టి కాడి, నాగలి, గుంటుక, దంతె లాంటి పనిముట్ల తయారు చేసేవారు. కానీ నేడు ఆ పరిస్థితులు మారి పోయాయి. దుక్కి దున్నే దగ్గర నుంచి పంట కోసే వరకు అన్ని యంత్రాలు రావడంతో వడ్రంగుల పరిస్థితి దయనీయంగా మారింది. పూర్వం గ్రామాల్లో వస్తు మార్పిడి పద్ధతి ఉండేది. అంటే రైతన్నకు కావాల్సిన పనిముట్లు వడ్రంగులు తయారు చేసి ఇస్తే.. పంట చేతికొ చ్చిన తర్వాత ఇంతా అని లెక్క చేసి అంత విలువ చేసే ధాన్యం వడ్రంగులకు ఇచ్చేవారు.

ఆ ధాన్యంతో వడ్రంగులు సంవత్సరానికి సరిపడా ధాన్యం నిల్వ చేసుకుని.. మిగిలితే ఇతర అవసరాలకు విక్రయించుకునేవారు. ఇలా ఆ రోజుల్లో వడ్రంగుల జీవితాల్లో వెలుగులు ఉండేవి. కాలానుగుణంగా యాంత్రీకరణతో వ్యవసాయంలో ట్రాక్టర్లు, ఇతర పనిముట్లు రావడంతో వడ్రంగులకు వృత్తి పని లేకుండా పోయింది. దీంతో వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది.

వడ్రంగులు తయారు చేసే పనిముట్లు

వడ్రంగులు ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన పనిముట్లన్నింటినీ తయారు చేస్తారు. నాగలి, గుంటుక, గొర్రు, దంతే, విత్తనపు బుట్టలు, కాడిమాను, ఎడ్లబండ్లు, చక్రాలు మడిగెం మొద్దు, గొడ్డలి కామ, పారకామ, డేకీస కామ, తదితర పనిముట్లను రైతులకు కావాల్సిన విధంగా వాటిని తయారు చేసి ఇస్తారు. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి గడపలు, కిటికీలు, దర్వాజలు, తలుపులు, మం చం, బల్లె పీటలు, దేవుని మండపం తదితర ఫర్నిచర్లను తయారు చేస్తారు.



సీతారాంపురంలో నాగలి చేస్తున్న వడ్రంగి

పట్టణాలకు పయనం

గ్రామాల్లో పనులు లేక వడ్రంగులు పట్టణాలకు పయనమవుతున్నారు. ఇప్పటికే పలువురు యువకులు పట్టణాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకొని తలుపులు, కిటికీలు, డైనింగ్ టేబుల్, బెడ్స్ లాంటివి తయారు చేస్తున్నారు. కొందరు ఫర్నిచర్ తయారు చేసే కంపెనీల్లో చిరు ఉద్యోగులుగా చేరుతున్నారు. మరికొందరు యంత్రాలను సమకూర్చుకుని వృత్తిని కొనసాగిస్తున్నారు. ఇక పట్టణాలకు వెళ్లలేక ఊరినే నమ్ముకున్న వడ్రంగులు ఇళ్ల వద్దే చిన్నాచితక పనులు చేసుకుంటూ కాలం వెళ్ల దీస్తున్నారు. గత ప్రభుత్వం కుల వృత్తులకు చేయూతనందిస్తాననీ మొండి చేయి చూపిందని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించి ఆదుకోవాలని వడ్రంగులు కోరుతున్నారు.

జీవన శైలి తారుమారు

వడ్రంగుల జీవనశైలి తారుమారైంది. ఎంతో మంది ఇదే వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. అయితే పరిస్థితుల ప్రభావంతో పనులు తగ్గాయి. దీంతో కుల వృత్తిని నమ్ముకున్న వారికి భవిష్యత్తు లేదని ఇతర రంగాలవైపు దృష్టి పెడుతున్నారు. అంతే కాకుండా వడ్రంగులకు పలు ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. పనులు చేస్తున్నప్పుడు దుమ్ము, పొట్టు వస్తుండంవల్ల దగ్గు, ఆయాసంతో పాటు కంటిచూపు మందగించడం, నడుము, వెన్నెముక, మోకాళ్లు, కీళ్ల నొప్పుల వంటి జబ్బులు వస్తున్నాయి. దీంతో పాటే పనులు చేస్తున్న సమయంలో చేతులు, కాళ్లకు గాయాలై అవిటివారిగా మారిన సందర్భాలున్నాయి.

26వ ఏట చేతి వేళ్లు పోయాయి..

మారేపల్లి సోమయ్య, కామారెడ్డిగూడెం



ఇప్పుడు నాకు 57ఏళ్లు. నా 26వ ఏట దూగోడ మిషన్‌లో పడి చేతి వేళ్లన్నీ పోయాయి. అయినప్పటికీ అధైర్య పడకుండా కుటుంబ పోషణ కోసం కుల వృత్తిని నమ్ముకొని ఇంటి వద్ద వడ్రంగి పని చేస్తున్నా. అన్నీ యంత్రాలు రావటం వల్ల పనులు పూర్తిగా తగ్గిపోయాయి. కుటుంబ పోషణ భారమై దుర్భర జీవితం అనుభవిస్తున్నాం.

ప్రభుత్వం ఆదుకోవాలి

మారోజు బ్రహ్మచారి, సీతారాంపురం



నేడు వ్యవసాయంలో యంత్రీకరణ కారణంగా మా కులవృత్తి కనుమరుగవుతోంది. చేతినిండా పని లేకుండా పోవటంతో పస్తులతో గడపాల్సి వస్తోంది. గతప్రభుత్వాలు అన్ని కుల వృత్తులవారిని ఆదుకుంటామని చెప్పి మొండి చేయి చూఆపయి. కాంగ్రెస్ ప్రభుత్వమైనా వడ్రంగులను ఆదుకొని మా జీవితాల్లో వెలుగు నింపాలి. ఇప్పటికే పనులు దొరకక ఈ తరం పిల్లలు పట్టణాలకు వలస వెళ్తున్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి

మారోజు మురళి, సీతారాంపురం



ప్రభుత్వం వడ్రంగులకు బీమా సౌకర్యం కల్పించాలి. పనులు చేసే సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా చేతులు, కాళ్లు పోగొట్టుకున్న వారు కూడా ఉన్నారు. అలాంటి వారికి సహాయం చేయడంతో పాటు 50 ఏళ్లు నిండిన ప్రతీ వడ్రంగికి పింఛను ఇవ్వాలి.

విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు గుర్తించాలి

- వార్తా పత్రికలు, ఇతర పుస్తకాలూ చదవాలి
- సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య



సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో బాల్యదశలోనే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎంపీ కడియం కావ్య అన్నారు. కాజీపేట ప్రశాంత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమానికి శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. విద్యార్థులెప్పుడూ వారి ఆలోచనా విధానాలకు అడ్డుకట్ట వేయొద్దన్నారు. ప్రస్తుత సామాజిక అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేసి ఆవిష్కరణల దిశగా పయనించాలన్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు సామాజిక అంశాలను కలగలిపిన వార్తా పత్రికలు, ఇతరత్రా పుస్తకాలను విద్యార్థులు చదవాలన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక తదితర రంగాల్లో నైపుణ్యం సాధించాలన్నారు.

కాగా, ఇన్‌స్పైర్ ఎగ్జిబిట్లతో 12 మందిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక చేశారు. సైన్స్‌ఫెయిర్‌లో థీమ్‌కు ఇద్దరి చొప్పున 14 ఎగ్జిబిట్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మరో ఇద్దరిని సెమినార్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అతిథుల చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ పరిశీలకులు సుబ్రత్‌కుమార్, జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, డీఎస్‌వో ఎస్. శ్రీనివాస్‌స్వామి, క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ఎంఈవోలు, నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేసి అర్జున్ యువతకు ఆదర్శం

- జిల్లా కీర్తి ప్రతిష్ఠలు విశ్వవ్యాప్తం చేశాడు..
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- అంతర్జాతీయ చెస్ దిగ్గజానికి సత్కారం

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 30 : (ఆంధ్రజ్యోతి): చెస్ క్రీడలో భారతదేశలో నెంబర్-1, ప్రపంచ స్థాయిలో రెండో స్థానంలో నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేసిన హనుమకొండ నగరానికి చెందిన ఇరిగేసి అర్జున్ వర్ధమాన క్రీడాకారులకు ఆదర్శప్రాయుడని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండ బాల సముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో చెస్ నెట్‌వర్క్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్జున్ అభినందన సభలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. నేటి యువత సెల్ ఫోన్, సోషల్ మీడియా వైపు ఆసక్తి కనబర్చుతున్నారని, అనుకున్న రంగంలో రాణించడానికి పట్టుదల క్రమశిక్షణతో సాధన చేయడం ద్వారానే అది సాధ్య పడుతుందని, దానికి ఉదాహరణ చెస్ దిగ్గజం అర్జున్ అని తెలిపారు. ఏటా నవంబర్ 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఒక్క రోజు పాటు చిన్నారులతో కలిసి వేడుకలు నిర్వహించడం జరిగేదని, కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల సంక్షేమం, అభివృద్ధి, పరిరక్షణ దృష్టిలో ఉంచుకొని పది రోజులుగా వేడుకలను నిర్వహిస్తోందన్నారు. ఆపద సమయంలో ఉన్న చిన్నారుల అశ్రయం కల్పించి కాపాడేందుకు చైల్డ్ ఎల్ప్‌లైన్-1098 నెంబర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడతూ.. ఇరిగేసి అర్జున్ రానున్న రోజుల్లో ప్రపంచస్థాయిలో ప్రథమ స్థానంలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు ఇరిగేసి అర్జున్ మాట్లాడుతూ.. పట్టుదలతో సాధన చేయడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునన్నారు. చెస్ నెట్ వర్క్ కో ఆర్డినేటర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామంలో చెస్‌క్రీడను ప్రోత్సహిస్తూ క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సన్మాన సభ ప్రారంభంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి అర్జున్ అభినందించారు. అనంతరం వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలు అర్జున్‌ను శాలువాతో సన్మానించారు. కాగా, సన్మాన సభకు వచ్చిన విద్యార్థులతో సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రాపిడ్ చెస్ పోటీల్లో పది చెస్‌బోర్డులను ఏకకాలంలో ఆడి విద్యార్థులపై విజయం సాధించాడు. ఈ కార్యక్రమంలో అర్జున్ తల్లిదండ్రులు ఇరిగేసి జ్యోతి - డాక్టర్ శ్రీనివాసరావు, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు మేజర్ శివప్రసాద్, బాసిరి రాజగోపాల్, కె.కర్నాకర్‌రెడ్డి, అన్నం చిన్ని వెంకటేశ్వర్లు, టీడీ. టామీ, బొల్లం సంపత్‌కుమార్, చెస్ నెట్‌వర్క్ ప్రతినిధులు నగరంలో పలు పాఠశాలలకు చెందిన చిన్నారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా వచ్చిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇరిగేసి అర్జున్‌ను కనీసం సన్మానించకుండా సభ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.



చెస్ క్రీడాకారుడు అర్జున్‌ను సన్మానిస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ ప్రావీణ్య తదితరులు

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని ఒడితలలో రూ.1.10కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నైన్‌పాకలో రూ.1.10 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అదే గ్రామంలో పార్టీ మండలఅధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా పాలన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. తొందరలోనే రైతు భరోసాతో పాటు అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసిందని ఆరోపించారు. నియోజకవర్గంలోని కొడవటంచ, బుగులోని గుటంట, నాపాక ఆలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, పర్యటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. నైన్‌పాక, వరికోల్‌పల్లి రైతుల భూసమస్యను పరిష్కరిస్తానని, కాస్తులో ఉన్న రైతులకు పట్టాలు పంపిణీ చేసేందుకు అధికారులతో సమీక్ష నిర్వహిస్తానన్నారు. రామప్ప చెరువు నుంచి డీబీఎం 38 కాల్వల ద్వారా నాలుగు మండలాల రైతులకు సాగునీరు అందేవిధంగా కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, మాజీ జడ్పీటీసీ ఓరం సమ్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, ఈఈ వెంకట్రావు, డీఈలు పాపిరెడ్డి, సదానందం, ఏడీఈ సందీప్, ఏఈ చంద్రశేఖర్, నాయకులు రత్నాకర్‌రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తూకంలో మోసం చేస్తే చర్యలు

భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): ధాన్యం తూకంలో మోసాలకు పాల్పడి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి, పెద్దకుంటపల్లి, ఖాశీంపల్లి, జంగేడుతో పాటు భూపాలపల్లి మండలంలోని గుడాడ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, ఇస్లావత్ దేవన్, బుర్ర కొమురయ్య, పిప్పాల రాజేందర్, జోగుల సమ్మయ్య, బొౌతు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల మండలంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1 నుంచి 9 వరకు నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అన్నిశాఖల అధికారులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. విజయోత్సవం సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వేతర సంస్థలను విద్యుద్దీకరణ చేయాలన్నారు. ఆదివారం సాయంత్రం సుభాష్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాలులో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వ ర్యంలో జరుగనున్న వేడుకలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీపీఆర్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో జరుపుకోవాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావుతో కలిసి జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తూ ఘనంగా నిర్వహించాలన్నారు. ఆయాశాఖల అధికారులకు కేటాయించిన తేదీల్లో ప్రణాళికాబద్ధంగా వారిశాఖల ద్వారా కార్యక్రమాలను నిర్వహించి రోజువారీ నివేదికల డాక్యుమెంటరీ సమర్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీకరించాలని సూచించారు. డిసెంబరు 1న తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏడాదిలో సాధించిన లక్ష్యాలపై విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక, ఉన్నత, ఇంటర్మీడియట్, డిగ్రీస్థాయిల్లో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మంద కృష్ణ పరామర్శ

టేకుమట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు దూడపాక శ్రీనివాస్ తాత దూడపాక లింగయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పరామర్శించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా నాయకుడు అంబాల చంద్రమౌళి, జిల్లా సీనియర్ నాయకులు నేముల శ్రీనివాస్, కేసారపు నరేష్, మేకల రమేష్, రాం చందర్, రేణుకుంట్ల శంకర్, నేరెళ్ల ఓదెలు, దినేష్, బొచ్చు తిరుపతి, మచ్చ శ్రీకాంత్, సంగి రవి, పాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న మంద కృష్ణ మాదిగ

విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మొగుళ్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల విద్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈసం దర్భంగా గురుకులంలోని తరగతి గదుదలు, పాఠశాల ఆవరణలో చెత్తాచె దారం, విద్యార్థులు తీసుకునే భోజనం, కూరలు, బియ్యం, కూరగాయలు, కోడిగుడ్లను పరిశీలించారు. పేద విద్యార్థులకు అందించే భోజనంలో కాంట్రాక్టర్ నాణ్యమైన సరుకులు అందించడంలేదని, కనీసం సరుకులను తనిఖీచేసే అధికారులే కరువయ్యారని విమర్శించారు. వసతిగృహాల్లో విద్యార్థులు చల్లని నీటితో స్నానాలు చేస్తున్నారని, వేడినీళ్లు అందించడంతోపాటు పలు సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యను అందించామని తెలిపారు. ఆయన వెంట గురుకులం ప్రిన్సిపాల్ శారద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు, జిల్లా నాయకులు జోరిక సదయ్య, కొడారి రమేష్, దానవేని రాములు, రవి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

క్రీడలు ప్రారంభం

ములుగు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకారం లిబర్టీ హైస్కూల్ ఆవరణలో ట్రస్మా ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్‌స్కూల్ స్థాయి క్రికెట్ పోటీలను శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌లు ప్రారంభించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వీరమల్లు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ట్రెజరర్ సురేందర్‌రెడ్డి, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ రీల్

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



కిరణ్



ప్రసాద్

ఏటూరునాగారం రూరల్, నవంబరు 30, (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పోడెం సమ్మయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సమావేశం జరగ్గా కార్యవర్గాన్ని ఖరారు చేశారు. మండల అధ్యక్షుడిగా పత్రి కిరణ్, ప్రధాన కార్యదర్శిగా పోడెం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా మడె చిట్టిబాబు, ఎట్టి స్వరూప, కోశాధికారిగా మండప సంతోష్, కార్యదర్శులుగా సుమన్ శ్రావణ్, రజిని, మధుసూదన్‌రావు, వెంకటేశ్వర్లు, వంశీ ప్రశాంత్, రంజిత్ ఎన్నికయ్యారు.

ఘనంగా రైతేరాజు పండుగ

వెంకటాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో రైతేరాజు పండుగ శనివారం ఘనంగా జరిగింది. పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటిస్థానంలో ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తోందని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించాలి : డీఈవో

ములుగు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబరు 1న మండల స్థాయిలో విద్యార్థులకు రెనవబుల్ ఎనర్జీ సోర్సెస్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు ఎంపీడీవోలతో సమన్వయ పరచుకుని ఏడాదికాలంలో విద్యాశాఖలో సాధించిన పురోగతిని తెలుపుతూ ఫ్లెక్సీలు, పోస్టర్లు ప్రదర్శించాలని, ఏపీసీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన, డీఎస్సీ-204 ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయుల గురించి, ఉపాధ్యా యుల బదిలీలు, పదోన్నతుల గురించి తెలిపేవిధంగా బ్యానర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కేజీబీవీలలో నూతనంగా నియామకమైన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ గురించి, నాణ్యమైన భోజన వసతి గురించి, డైట్ కాస్మెటిక్ చార్జీల పెంపుపై ప్రజలకు బ్యానర్ల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు?

కాటారం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరంపల్లి జీపీ పరిధిలో అనుమాల సత్యమ్మ ఇంట్లో జరిగిన చోరీ ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేసి పురోగతి సాధించినట్లు తెలిసింది. కాటారం సీఐ నాగార్జునరావు, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, కాటారం, మహాముత్తారం ఎస్సైలు అభినవ్, మహేందర్, సీసీఎస్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో దొంగల ఆచూకీని కనుగొన్నారని సమాచారం. సెల్‌ఫోన్ డాటా ఆధారంగా పోలీస్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు పాత నేరస్థుల ఫింగర్ ప్రింట్స్ సాయంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే ముఠాలోని ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం : ఎస్పీ

ములుగు కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ఎస్పీ శబరీశ్ అన్నారు. ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్సై ఎం.కర్ణారావు రిటైర్ కాగా ఆయన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం శని వారం జరిగింది. కర్ణరావు దంపతులను ఎస్పీ సన్మానించి జ్ఞాపి కను అందజేశారు. 41 సంవత్సరాలపాటు పోలీస్‌శాఖలో కర్ణరావు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కర్ణరావు దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

శ్రావ్య మృతిపై విచారణ చేపట్టాలి

ములుగు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఎల్ఎల్‌బీ చదువుతున్న విద్యార్థిని ఇస్లావత్ శ్రావ్య ఇటీవల అనుమానాస్పద స్థితిలో మరణించిందని, ఈఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గోర్‌సేన జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఏవోకు శనివారం ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. శ్రావ్యది సాధారణ మరణం కాదని, ఆమెపై అఘాయిత్యం జరిగిందని జిల్లా అధ్యక్షుడు పోరిక రాజ్‌కుమార్ ఆరోపించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గోర్‌సేన నాయకులు దారావత్ సారయ్య, నాగావత్ ప్రతాప్, మూడ్ రవీందర్, బోడ కిషన్, పోరిక రాహుల్, భూక్యా దేవేందర్, రఘు, రవి, గాంధీ, రవివర్మ పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం స్పందించాలి : ఎస్ఎఫ్ఐ

ఏటూరునాగారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఎస్ఎఫ్ఐ ఏటూరునాగారం డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థుల ఫుడ్ పాయిజన్ మరణాలు తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు విద్యార్థుల హత్యలుగానే పరిగణించాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా, మండల కమిటీ నాయకులు ముక్కెర ధనుష్, బట్ట స్వామి, రాకేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రాణాలతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు దీకొండ భరత్ అన్నారు. ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఇచ్చిన బంద్ శనివారం మండలంలో విజయవంతమైంది. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మండలంలోని గురుకులాల, వసతిగృహాలను సందర్శించి ర్యాలీలు నిర్వహిం చారు. అనంతరం భరత్ మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపో తున్నా సీఎం రేవంత్‌రెడ్డి కనీసం స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, నరేష్, సాయితేజ, కిరణ్, లక్ష్మీనారాయణ, భాగ్య, కిరణ్, ప్రేమ్‌చంద్‌నాయక్, సాయిరాం పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

డివిజన్ ఇన్‌స్పెక్టర్ అజ్హరుద్దీన్

కాటారం, నవంబరు 30: తపాలాశాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంథని డివిజన్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజ్హరుద్దీన్ అన్నారు. కాటారం ఉప తపాలా కార్యాలయం పరిధిలోని శంకరంపల్లి, ధన్వాడ తదితర గ్రామాల్లో శనివారం డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తపాలా శాఖ అందిస్తున్న పొదుపు, బీమా పథకాలపై అవగాహన కల్పించారు. బాలికలు, వృద్ధులు, మహిళలు, ఉద్యోగులకు అందిస్తున్న రికరింగ్ డిపాజిట్ ఎస్ఎస్‌వై, ఎస్‌సీఎస్ఎస్, పీపీఎఫ్, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీపీఎంలు కిష్టయ్య, మల్లయ్య, హరీశ్, మహేష్, జానీ, మెయిల్ ఓవర్సీస్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంత్రి సీతక్క సన్మానం

ఏటూరునాగారం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే స్కూల్ గేమ్స్ పోటీలలో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంత్రి సీతక్క సన్మానించారు. తన పర్యటను ముగించుకొని హైదరాబాద్‌కు బయల్దేరుతున్న సమయంలో ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి విద్యార్థులను ఈ మేరకు అభినందించారు.

'ఫుడ్ పాయిజన్ పేరుతో కుట్ర'

మల్హర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫుడ్ పాయిజన్ పేరుతో బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆయన హాస్టళ్లకు సెక్రటరీగా ఉన్న సమయంలో నియమించిన ఫుడ్ కాంట్రాక్టర్లు, వర్కర్లే ఇప్పటికీ కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే ప్రజలు బీఆర్ఎస్‌ను, ప్రవీణ్‌కుమార్‌ను క్షమించరని విమర్శించారు.

అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే తెల్లం

వాజేడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. వాజేడును అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు పాటుపడ తానని తెలిపారు. ములుగు కలెక్టరు దివాకరతో కలిసి ఆయన మండల కేంద్రంతో పాటు గుమ్మడి దొడ్డి, జగన్నాథపురంలో శనివారం పర్యటించారు. రూ. 2.20 కోట్లతో చేపడుతన్న అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో 18 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. గుమ్మడిదొడ్డిలో సీసీ రోడ్ల నిర్మాణాలు, రెవెన్యూ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జగన్నాథపురంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ప్లేస్కూల్ విద్యార్థులకు ఆటవస్తువులు, యూనిఫాం అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక విద్య దేశానికే ఆదర్శమ న్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో సుమారు రూ. 15 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రానున్న కాలంలో మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి మరిన్ని రోడ్లు, ఇతర భవనాల నిర్మాణాలకు ప్రభుత్వ నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో వెంకటేశ్, ఈఈ అజయ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి శిరీష, ప్రత్యేక అధికారి సర్దార్ సింగ్, తహసీల్దారు వీరభద్రప్రసాద్, సీడీపీవో ధనలక్ష్మి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్‌వర్మ, నాయకులు చెన్నం ఎల్లయ్య, కాశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి అక్షరాభ్యాసం చేస్తున్న ఎమ్మెల్యే

● వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం, వాజేడు మండలాల అభివృద్ధికి కృషిచేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. మండలంలో ఆయన శనివారం పర్యటించారు. బీసీమర్రిగూడెంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమీపంలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఆర్డీవో వెంకటేశ్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి శిరీష, ప్రత్యేక అధికారి సర్దార్‌సింగ్, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సీడీపీవో ధనలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపల్ పరిధిలోని 30 వార్డుల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని, ఇందులో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. చైర్‌పర్సన్ సెగ్గ వెంకటరాణి అధ్యక్షతన మునిసిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు పేర్కొన్న పలు తీర్మానాలకు ఆమోదించారు. పట్ట ణం వేగంగా అభివృద్ధి చెందతున్న నేపథ్యంలో శానిటేషన్ పనులను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు.

సమావేశంలో వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, కమిషనర్ రాజేశ్వర్, మేనేజర్ రమేష్, టీపీవో సునీల్ కుమార్, ఏఈ మానస, ఏవో అశోక్‌కుమార్, ఆర్ఐ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలి

● లంబాడా హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్

ఏటూరునాగారం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి కల్పించాలని లంబాడా హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బానోతు ప్రవీణ్ నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాలతో పాటు పలు వసతి గృహాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులకు విద్యాబోధనతోపాటు మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాటాడుతూ నిరుపేద గిరిజన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అంకితభావంతో వ్యవహరించాలన్నారు. భోజన, వసతి కల్పనలో ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గురుకులాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న సంఘటనలతో విద్యార్థులు ఆవేదన చెందుతున్నారని, వారికి మనోధైర్యం కలిపించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులపై విషం చిమ్ముతున్న ప్రవీణ్ కుమార్

టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు



విలేకరులతో మాట్లాడుతున్న చల్లూరి మధు

భూపాలపల్లిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విషం చిమ్ముతున్నారని టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు ధ్వజమెత్తారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ కార్యాల యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న ప్రవీణ్ కుమార్ అనుచరులే ఇప్పుడు సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్నారని తెలిపారు. అప్పుడు లేని కల్తీ ఆహారం ఇప్పుడు ఎలా జరుగు తుం దని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్‌కు తలొగ్గిన ప్రవీణ్‌కుమార్ లోపాయికారి ఒప్పందంతో పనిచేస్తున్నారని విమర్శించారు. హాస్టళ్లలో విషపు ఆహారం అనే వ్యాఖ్యలు ఆయన కుట్రలేనని ఆరోపించారు. విలేకరుల సమా వేశంలో పార్టీ జిల్లా నాయకుడు అంబాల శ్రీనివాస్. దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, పిప్పాల రాజేందర్, క్యాతరాజు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైన్ షాపులో చోరీ

భూపాలపల్లి కృష్ణకాలనీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణ పరిధి మంజూర్‌నగర్‌లోని కల్యాణి వైన్ షాపులో చోరీ జరిగింది. వైన్స్ నిర్వాహకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం 10 గంటలకు షాపు తెరిచేందుకు వచ్చిన నిర్వాహకులు షెట్టర్‌కు వేసి ఉన్న తాళాలను పగలగొట్టి ఉన్నాయి. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు, క్లూస్‌టీం సభ్యులు చేరుకొని షాపును పరిశీలించారు. రూ.40వేల నగదు, ఐదారు మద్యం బాటిళ్లతో పాటు సీసీ కెమెరాల్లోని హార్డ్ డిస్క్‌ను సైతం దుండగులు ఎత్తుకెళ్లినట్లు షాపు యజమాని వేణు వెల్లడించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

కాకతీయఖని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తోం దని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. భూపాలపల్లి పట్టణం లోని కొమురయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న సింగరేణి యాజమాన్యంతో జరిగిన స్ట్రక్చర్ మీటింగ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ముఖ్యంగా డిస్మిస్డ్ కార్మికుల అంశంతో పాటు మారుపేర్ల విషయంలో వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తే కార్మికులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని వివరించామన్నారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న కాలంలో స్ట్రక్చర్ మీటింగ్ జరుగలేదని గుర్తుచేశారు. కార్మికుకు రావాల్సిన అలవెన్స్‌లు, ఈపీ ఆపరేటర్ల సమస్యలు, ప్లేడే, క్యాంటీన్ల ప్రైవేటీకరన, కార్మికుల పిల్లల మెడికల్ సీట్స్, స్కాలర్‌షిప్ తదితర అంశాలపై యాజమాన్యంతో చర్చించామన్నారు. విలేకరుల నాయకులు మోటపలుకుల రమేష్, సుధాకర్‌రెడ్డి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

మంగపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారు మూల అటవీప్రాంతం కొత్తూరు మొట్ల గూడెం గ్రామపంచాయతీ పరిధి రేగులగూడెం గొత్తికోయగూడెంలో 75 మంది గొత్తికోయలకు శని వారం దుప్ప ట్లు, రగ్గుల పంపిణీ లయ న్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగింది. సికింద్రా బాద్ వివేకానందపురం ఆధ్వర్యంలో పింగిలి నాగరాజు గొత్తికోయలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈకార్య క్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు సిద్దంశెట్టి కనకారావు, ప్రధాన కార్యదర్శి అనంతుల రవిగుప్తా, కోశాధి కారి సింగిరికొండ శ్రీనివాస్ పాల్గొ న్నారు.

కేసీఆర్ పాలనలో రూ.7వేల కోట్ల అప్పు

(5వ పేజీ తరువాయి)

తగ్గించారని విమర్శించారు. ఢిల్లీలో ధర్నా చేస్తూ 700 మంది రైతులు మరణిస్తే వారి వివరాలు లేవని మోదీ ప్రభుత్వం చెప్పడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారెంటీలను అమలు పరుస్తూ మహిళలు, విద్యార్థులు, రైతులకు, కార్మికులు, నిరుద్యోగులు, సంబ్బంధ వర్గాల కోసం పాటుపడు తోందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 50వేల ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో టెన్త్, ఇంటర్, గ్రూప్స్ పేపర్ లీకేజీలు జరిగాయన్నారు. సింగరేణి కార్మికుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నూతన బొగ్గు గనులు, ఇండస్ట్రియల్ కారిడార్, సొంతింటి కళను సాకారం చేసేందుకు 200 గజాల ఇంటి స్థలం, పెర్క్స్‌పై ఇన్‌కం ట్యాక్స్ రద్దు అయ్యేలా కృషి చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్‌రెడ్డి, నాయకులు, నర్సింహారెడ్డి, దర్మపురి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనక్ ప్రసాద్‌కు భూపాలపల్లి ఏరియా ప్రైవేట్ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందజేశారు. తమకు వేతనాలు సరిపోవడంలేదని, ఆస్పత్రి సౌకర్యం కల్పించాలని, సింగరేణి బ్యారెక్‌లలో ఉండేందుకు అవకాశం కల్పించాలని, సింగరేణి వాహన టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి నాగేంద్రబాబు, డ్రైవర్లు రాహుల్, ఆమకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.